# ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్



పి. సులోచన సింహాద్రి

అవే కళ్ళు! అవే కళ్ళు మళ్ళా ఎంత వెతికినా కనబడవు. ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేటదాటి వేగంగా పరిగెడుతున్నది. రైలు శబ్దంలాగే రైల్లో కొందరి చూపులు ముందుకి ఆలోచనలు వెనకకు వెళ్తున్నాయి.

స్లీపరులో బ్రేక్‌ఫాస్టుచేసి అందరూ సర్దుకొని కూర్చున్నారు:

పేపర్లు, పుస్తకాలు చదివేవాళ్ళు,

కబుర్లుచెప్పుకునే వాళ్ళు ఎవరి ధోరణిలో వాళ్ళున్నారు.

అందులో ఓ అరవై సంవత్సరాలున్న ఆయన ఆ స్లీపర్స్‌లో ఎవరికోసమో వెతుకుతున్నట్లు తిరుగుతూ.

"ప్చ్! లాభం లేందే! ప్రయాణం చేసినప్పుడల్లా ఆమె కనిపిస్తుందేమో అనుకోవడం నాదే తప్పు" అనుకుంటూ తన సీటులో చతికిలపడ్డాడు.

రెండు నెలలల క్రిందట ప్రయాణం ఇదే రైల్లో ఇదే క్యూబికల్‌లో చేసినప్పుడు జరిగిన సంఘటన (గుర్తుకు) మరచిపోలేకుండా ఉన్నాడు.

*  ***  *

ఆరోజు ఇలాగ ఖాజీపేట దాటింది రైలు. ఆ క్యూబికల్‌లో ఒకవైపు కొత్త దంపతులు ఒక ఇరువయి సంవత్సరాల యువకుడు, రెండవవైపు వయసు పైబడిన దంపతులు అర వయసంవత్సరాల ఆమె కూర్చున్నారు.

ఇక రెండు బెర్తులవైపు నెలల పసిపిల్లవాడితో తల్లిదండ్రులు కూర్చున్నారు.

ఎవరి మట్టుకువాళ్ళు ఒకరి నొకరు తెలుసుకోవాలన్న కుతూహలంతో ఉన్నారు. సామాను బింద ...పందరగా కాలుకదపడానికి వీలుగాలేకుండా పెట్టారు. ఆ పెద్దాయన మధ్యమధ్యలో ప్రక్కన కిటికీ దగ్గర కూర్చుని మధ్యమధ్యలో ఆ పెద్దావిడను తను ఎక్కడో చూసినట్లుందని గమనిస్తున్నాడు.

ఆ విషయం ఆయన భార్య గమనిస్తూనే ఉంది.

ఆమె యువకుని "బాయనా నాకు కాస్త వాటర్ బాటిల్ ఇలాఇస్తావు మందువేసుకోవాలి" అని అడిగింది.

అతను బాటిల్ అందిచ్చాడు. ఆమె బాటిల్ అందుకుని బాగ్‌లోంచి మాత్రలు తీసుకుని వేసుకొని తిరిగి బాటిల్ ఇచ్చి హుక్కుకు తగ్గించమని సంజ్ఞచేసింది. ఆమె కళ్లల్లో నీరుతిరగడం చూశాను.

"నీ పేరేంటి నాయనా? ఎంత వరకు వెళ్తున్నావు?"

రంజన్. ఢిల్లీ వెళ్తున్నాను. ఐఐటిలో ఎమ్.టెక్ చేయడానికి వెళ్తున్నానండి" అని ముక్తసరిగా జవాబుచెప్పాడు.

"హైదరాబాదులో ఎవరున్నారు?"

"మా అమ్మమ్మ ఉందండి. ఆమెను చూసి వెళ్తున్నాను. మా అమ్మ బెంగపెట్టుకుంది.

ఉదయం నవతరం వారపత్రిక

ఎంత వద్దని చెప్పినా చాలా ఫలహారాలు చేసి ఇచ్చారు. అక్కడ ఢిల్లీలో వాళ్లునవ్వుతారు పిల్లకేమో అర్థంకాదు పిచ్చి ప్రేమ అయినా ఇవన్నీ ఎన్ని రోజులు తింటావని ఆమె కళ్లనీళ్లు తుడుచుకుని నవ్వింది చిన్నగా.

"ఎందుకండీ నవ్వుతున్నారు?"

"ఏం లేదు నాయనా తల్లి మనసు అలాంటిది. అయినా నీకేం అర్థమవుతుందిలే. అనుభవించిన వాళ్లకే తెలుస్తుంది.

కుర్రతనం. నీవన్నది నిజమే. అక్కడ కొత్తగా కాలేజీలో చేరడం ఇవన్నీ చూసి స్నేహితులు ఎగతాళి చేస్తారు. ఏం! ఫరవాలేదు. వాళ్లు నవ్వితే మీ కోసం తెచ్చాను అని అందరికీ పంచిపెట్టి తినమను. అవమానం ఏంలేదు!"

ఆవిడ నీలం పట్టుచీర కట్టుకుని పెద్ద కుంకుమ బొట్టు చేతినిండా గాజులు హుందాగా ఉంది. ఆవిడకు ఆ ఎదురుగా ఉన్న ఆయన తనను చూసే తీరు నచ్చలేదు.

ఇక నూతన దంపతులు... చిన్న పిల్ల పాదాలకు పసుపు. పారాణి పాంజీపట్టీలు మట్టెలు, మెళ్లో పసుపుతాడు, బంగారునగలు నల్లపూసలు, చేతికి బంగారుగాజులు మధ్య రంగు రంగుల మట్టి గాజులు, లేత గులాబి నైలాక్సు చీరకట్టుకొని పసిమి ఛాయతో ముచ్చటగా ఉంది. భర్తను చూసి మనుసిగ్గులతో ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వేళ్లతోనే ప్రేమ బాసలు చేస్తున్నారు.

ఇవన్నీ ఆ పెద్దావిడ గమనిస్తూనే ఉంది.

"ఎన్నాళ్లు అయిందమ్మా పెళ్లి అయ్యి? ఏ ఊరు వెళుతున్నారు?" అతను సిగ్గుపడుతూ "పదిహేను రోజులయిందండి. సెలవు అయిపోయింది. భూపాల్ వెళుతున్నామండి అక్కడ నాకు ఉద్యోగం. మా లలితకు అసలు హిందీ రాదు మరి ఎలా మేనేజ్ చేస్తుందో ఏమో"

ఆ! చిన్నపిల్ల హిందీ ఎంత సేపు నేర్చుకుంటుంది అదే వస్తుందిలే"

మా నాన్నగారు అగ్రికల్చర్ ఆఫీసర్ హైదరాబాదులో. లలిత తండ్రి మా నాన్నగారు చిన్ననాటి స్నేహితులు. మామగారి ఉద్యోగం తెనాలి, లలిత ఎప్పుడు అటువైపే చూడకపోవడం హిందీ నేర్చుకోడానికి అవకాశం రాలేదు.

"అక్కడ వెళ్లాక అన్నీ అలవాటు అవుతాయి అమ్మా లలితా! ఏం చదువుకున్నావు?

లలిత సిగ్గుపడుతూ బిఏ చదివానంది.

ఇంతలో కాఫీ!కాఫీ! అంటూ వచ్చారు అమ్మే వాళ్లు.

ఇద్దరు ముగ్గురు నిద్రకి జోగుతున్నారు.

ఉన్నట్టే ఉండి సిగ్నల్ పడక రైలు చిన్న స్టేషన్ లో ఆగిపోయింది.

పెద్దావిడ బాత్‌రూమ్‌కి వెళ్లగా చూసి "ఏమిటండి రైళ్లు ఎక్కిన దగ్గరనుండి చూస్తున్నా ఎంతో మంది వస్తూంటారు పోతుంటారు. మీరేమిటి ఆవిడను అంతగా గుచ్చి గుచ్చి చూస్తున్నారు" అని చిరుకోపాన్ని చూపించింది భార్య.

"పోని వయసులో ఉన్న పిల్లా అంటే అదీకాదు. దగ్గర దగ్గర మీ వయసే ఉంటుంది. నాకేమీ మీ పద్ధతి నచ్చలేదు సుమండీ"

"మీ ఆడవాళ్లకి ఉన్నది అదే వెధవబుద్ధి. ఆవిడ పక్క చూసినంత మాత్రనే నీకు మించిపోయినదేమిటి? ఎక్కడో చూసినగుర్తు. నీవేమీ గాభరా పడక్కర్లేదు."

"హు! సరే ఇక ఊరుకోండి."

"పోనీ నీవే ఆమెను పలుకరించి పేరు, ఊరు, వివరాలు అడిగి తెలుసుకోరాదూ! నేను అడిగితే బాగుండదు!"

"ఆ!ఆ! మీకు ఆవిడ ఎవరో తెలిసికొనేవరకు నిద్ర పట్టేటట్లు లేదు. ఎంతో మందిని చూస్తుంటాము పిల్లల తండ్రి మనవరాలు కూడా ఉన్నారు. సిగ్గులేకపోతే సరి" అని కసిరికొట్టింది.

"ఇక ఊరుకోవే బాబూ నీకు పుణ్యం ఉంటుంది. ఆవిడ వచ్చినంటే బాగావుండదు"

"ఆవిడను మీరు చూస్తే బాగుంటుంది కాని నేను అన్న మాటలు ఆవిడ వింటే భాగుండదు. మీకు గొప్ప మహామర్యాద"

"సరేలే! నీ నోరు నీవు పారేసుకో. నాకేమిటి మధ్యలో. ఈవిడ గయ్యాళి పాపం భర్త ఎలా భరిస్తున్నాడో అని అందరూ జాలిపడతారు."

* *** *

రైలు ప్రయాణిస్తోంది వేగంగా.

నూతన దంపతులు ఒకరికొకరు కళ్లతోనే మాట్లాడుకుంటున్నారు. సిగ్గు దొంతరలతో చిరునవ్వులతో మునివేళ్ల చిలిపిచేష్టలతో, మూగ భాషలతో ఆనందంలో మునిగితేలుతున్నారు. ఎప్పుడు వాళ్లు ఊరు చేరి ఎవ్వరూలేని చోట ఆనందంగా గడుపుదామా అని నిరీక్షిస్తూ క్షణం ఒక యుగంలాగా గడుపుతున్నారు.

* *** *

రంజన్ కూడా వాళ్లవైపు ఆశ్చర్యంతో చూస్తూ తనలో తాను భావించుకుంటున్నాడు. తన ఎమ్.టెక్ అయి ఉద్యోగం అయిన తరువాత తన ఇష్టమయిన మరదలు శుభతో పెళ్లి అయితే ఇలాగే ఉంటాము కదా అనుకుంటున్నాడు.

ఏమిటో! అత్తయ్యకు ఒక్కతే కూతురు శుభ. ఆస్తి అంతా ఆమెదే. పెళ్లిచేసి ఢిల్లీ పంపుతాము నాయనా అని ఎంత చెప్పినా నేను వినలేదు. చదువు సాగదని అన్నాను. పెద్దవాళ్లు చెప్పినమాట వింటే నేను ఇలాగే సంతోషంగా ఉండేవాడిని. అత్తయ్య డబ్బు పంపుతుంటే ఇద్దరం చదువుకునేవాళ్లము. అంటూ ఆలోచనలో పడిపోయాను.

* *** *

పెద్దాయన ఎక్కడో చూసినట్లుందని ఎవరయి ఉంటారా అని కుతూహలంతో చూస్తున్నా కాని ఈ వయస్సులో ఇంకో స్త్రీని చూడాలనుకోవడం తప్పు అనుకుంటుంది నా భార్య అని ఆలోచనలతో బయట ప్రకృతిని తిలకిస్తూ ఉండిపోయాడు.

రైలు వేగం హెచ్చి ఒకరి మాటలు ఒకరికి వినబడ్డం లేదు. ఇక నా భార్య కోపంవచ్చి నాతో కూడా మాట్లాడడం మానివేసింది. ఆమెను నేనే పలకరిస్తాను అని ధైర్యం తెచ్చుకున్నాడు.

మధ్యాహ్నం భోజనానికి ఆర్డరు తీసుకోడానికి మనిషి వచ్చాడు. అందరు మీల్స్ ఆర్డర్ ఇచ్చారు. ఇంతలో అందరూ భోజనం ఎలా ఉంటుందో అన్న టాపిక్ చర్చించారు.


* *** *

"ఏమండి మీరెంతవరకు వెళుతున్నారు?"

"నేను ఢిల్లీ వెళుతున్నాను. అక్కడ నా పెద్దవాడు భార్య పిల్లలు ఉన్నారు. అతను ఇంజనీరు. చూడాలన్నప్పుడల్లా ఇలా వెళుతుంటాను" అని ఆయన పక్క చూపింది.

"ఇంతకీ మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది. మీ పేరు"

"ఎక్కడో కలుసుకుంటూ ఉంటాము. విడిపోతూ ఉంటాము. నా పేరు సరోజిని. అందరూ సరూ అని పిలుస్తారు. చిన్నప్పుడు విశాఖపట్నంలో చదువుకున్నాను. మా వారు పి డబ్ల్యూ డిలో



సూపరింటెండేంట్ ఇంజనీర్ చేసి రిటైరు అయ్యారు. ప్రస్తుతం హైదరాబాదులో బంజారాహిల్సులో ఇల్లుకట్టుకొని అక్కడ ఉంటున్నాము" అని అన్ని వివరాలు చెప్పేసింది. అయ్యో! ఇవాళ స్టేషన్‌కి వచ్చారు మీరు చూడలేదా''

"లేదండి.చూడలేదు."

''అయితే ఇంకేం విశాఖలోనే చూసి ఉంటాను''

''నేను విశాఖలో కొన్నాళ్లున్నాలెండి. అక్కడే బిఏ చదివాను. తరువాత పెళ్లి అయింది చెప్పుతుంటే చాలా సంగతులు ఉంటాయి. మా అత్తవారు ఏలూరు.ఇక రైలు శబ్దంలో మాటలు వినపడకమానేశారు.

కొంచెం సేపు అందరూ పత్రికలు చదువుకుంటూ గడిపారు.
మీల్స్ స్టేషన్ రావడం అదరికీ భోజనాల ప్లేటలు అందాయి భోజనం చేశారు.

నూతన దంపతులు ఒకరి కొకరు మీరు తినండి అంటే నీవు తిను అంటూ ముచ్చట్లు పడుతున్నారు.

సరోజిని వీళ్లని గమనించి నవ్వుతూ "పెళ్లినాడు బంతిలో వడ్డనచేసి ముచ్చట చూడాలని ఎంతో మంది ప్రక్కన చేరి వేళాకోళాలాడుతారు. ఈ రోజు మిమ్మల్ని చూసి ఆనందిస్తున్నాను"

ఆవిడ అన్నమాటలకు గాభరాపడి బిత్తరచూపులతో త్వరగా తినే శారు.

"ఫరవాలేదు పెద్దదాన్ని తమాషాగా మా పెళ్లి ముచ్చట జ్ఞాపకం వచ్చి అన్నాను. మీ వయసు అలాటిది."

పెద్ద అతనిని చూసి సరోజిని ''మీరెంతవరకు వెళ్తున్నారు? నాకు కూడా మిమ్మల్ని చూసినట్లుంది. ఎక్కడ ఉంటారు? ఏ ఊరు అని ప్రశ్నల వర్షం కురిపించింది.

అతని భార్య ఒకసారి చేతితో సంజ్ఞ చేసింది మాట్లాడవద్దని.

ఆయన పట్టించుకోలేదు.

"నాకు అలానే అనిపిస్తుంది.

ఎన్నోచోట్ల ఎంతోమందిని కలుసుకుంటూ ఉంటాము ఇన్ని గంటల ప్రయాణంలో ఎన్నో సంగతులు మాట్లాడుకుంటూ ఉంటాము. ప్రయాణం బోరు కొడుతుంది ఎంతో సన్నిహితులుగా ఉంటారు.. ఎవరి గమ్యస్థానాలను వారు చేరేక ఎవరికి వారే మరచిపోతారు. ప్రయాణం చేసినంతసేపు ఏదో ఆప్యాయతతో ఆప్తుల్లాగ ప్రవర్తిస్తారు.

జీవితాలు చాలా విచిత్రంగా ఉంటాయి సుమండి. జీవితంలానే ఈ ప్రయాణం కూడా.

"మిమ్మల్ని కూడా ఎక్కడో అలాగే చూసి ఉంటాను."

''అలాకాదండి. ఇంకా ఏదో చాలా రోజుల క్రిందట దగ్గర సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది.''

''మీ పేరు?''

''రాఘవరావు''

ఇలా ప్రశ్నలు వేయడం ఆవిడ తీరే అంతత్వర త్వరగా మాట్లాడడం, అందరినీ ఆప్యాయతతో పలకరించడం,ఎక్కడో తెలిసీ తెలియని బంధాలు కల్పించుకోవడం,అతనుగొంతు సవరించుకొని సంతోషంగా జవాబులు చెప్పడం మొదలుపెట్టాడు.

విశాఖలో చదివాను కదా తరువాత సేల్సు టాక్స్ ఆఫీసర్ చేశాను. రిటైరు అయ్యాము..పిల్లలు అయిదుమంది. మనవలు ఘుగ్గురు. హైదరాబాదులో ఉంటున్నాం. ఆమె తీక్షణంగా చూసింది.

"మీ పేరు సరోజిని అన్నారు కదూ"

ఉన్నట్టుండి మనసులో ఎప్పుడో జరిగిన సంఘటనలు తళుక్కుమంది. మనసు ఎన్నో సంవత్సరాల వెనుకకు తీసుకొని పోయింది.

*  ***  *

అవే కళ్ళు! అవే కళ్లు! మరి సందేహం లేదు వాలుచూపులు నా ప్రక్క చూస్తుండేవి. నేను సినప్పుడు ఆమె మరో ప్రక్క చూసేది ఏమిటో ఆ ఆకర్షణ. సరిగా నా పక్క బెంచీలో కూర్చునేది.

"ఆ! గుర్తున్నట్లు గుర్తుకొచ్చింది. పేరు సరోజ కదూ! ఇక ఆరునెలలు అనుకుంటా కలిసి చదువుకున్నాము."

*  ***  *

సీతమ్మ ధార..కొండలు లోయలు చిక్కని అడవి చీకటి పడింది. భయం భయంగా ఉంది. ఇద్దరూ కలిసి చేతులు కలిపి నడుస్తున్నారు. దారి తెలియలేదు. మబ్బు మూసుకుంది.. ఉరుములు మెరుపులు.

ప్రకృతి తిలకిస్తూ తోటిస్నేహితులను విడిచి ముచ్చట్లు చెప్పకుంటూ ఎంతో దూరం.. వెళ్లి దారితప్పారు.

ఇంతలో ఎంత చీకటి.

''మనకోసం వెతుకుతుంటారు రమా,వేణు." అన్నాడు అతడు.

''ఆ!ఆ! ఏం వెతకరులే వాళ్ల ధోరణిలో వాళ్లుంటారు అసలే ప్రేమికులు,అందరినీ మరచి ఉంటారు" అంది ఆమె.

''అహా! ఏదో పెద్ద కబుర్లు చెప్పుతున్నావు. నీవు ప్రేమికురాలుకానట్టు!'' అని అతను ఆమె చేతిని మృదువుగా నొక్కాడు ప్రేమగా చూస్తూ.

అదే సమయంలో ఎక్కడో పిడుగుపడింది. అంతే ఆమె భయంతో అతనిని కౌగలించుకుంది.

మరుక్షణం కంపితురాలై కింద కూలబడింది.

సన్నని చినుకు ప్రారంభమయింది.

తనకు జరిగిన ఆ సన్నివేశం తలుచుకుని అయోమయంలో పడింది.

ఇది మధురానుభూతే నా! భయమా అని.

" నీ భయం నువ్వూను ఇక పద వెనుకకు పోదాం అదే కనిపిస్తుంది దారి"అన్నాడు.

అతనిలో అతను నవ్వుకున్నాడు.

స్త్రీస్పర్శ! అందులోను అందమయిన వయసులో ఉన్న స్త్రీ. తనలో ఏవేవో కోరికలు రేకెత్తించాయి.

ఆమె మెల్లగా లేచి రాళ్లమీద వడివడిగా నడవడం మొదలుపెట్టింది. వెంటనే కాలుజారి పడింది.

''సరసా! ఏమిటి నీకు ఆ తొందర?''


''ఆగు!! దెబ్బ తగిలిందా లే'' అని చెయ్యి పట్టుకుని లేవదీశాడు.

ఆమె ముఖంలోకి ప్రేమతో చూశాడు.

కళ్లు కళ్లు కలిశాయి.

మేనులు పులకరించినాయి.

మెరుపులు మెరిసేయి.. ఉరుములు ఉరిమినాయి.



ఆ ఉద్రిక్తతలో తనువులు ఏకమయినాయి.

మబ్బులు వీడినవి. దాగున్న చందమామ వెండి వెన్నెల విస్తరించాడు. ప్రకృతి ఆనందంతో తాండవం చేసింది. ఆమె మూసిన కనులను అతను ముంబించాడు. అలా ఆమె అతని వొడిలో ఎంత సేపు ఉందో ఇరువురికి సమయం తెలియలేదు. చిరుగాలికి ఎగురుతున్న ఎండు ఆకుల శబ్దం కీచురాళ్ల శబ్దం తప్ప అంతా నిశ్శబ్దమే.

ఆమె ముఖంలో చిరునవ్వు చూసి—

''సరసా! జీవితమంతా ఇలాగే హాయిగా మనం ఇద్దరం ఉండిపోవాలని ఉంది కదూ!'' అని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

''ఆ! ఎక్కడ ఉన్నాము కలా! నిజామా! ఏమయింది'' అని కలవర పడుతూ అతనిని విదిలించుకుని దూరంగా జరిగికూర్చుంది.

''సరూ! నీకు కోపం వచ్చిందా. జర్గిన దానికి నన్ను క్షమించు''

ఆమె మనసులో ప్రళయం. ఏమిటి ఇలా జరిగింది అన్న ప్రశ్నతో.

*   ***   *

అందరూ భోజనాలు చేసి గెస్టుహౌస్‌లో చీట్లపేక ఆడుతున్నారు.

''ఏంటి! రఘూ సరసకనబడరే చీకటయింది?'' అన్నాడు వేణు.

''ఏమిటి ఆశ్చర్యం రోజూ క్లాసులో చూడ్డంతేదూ. రఘు సరసని చూడగానే కళ్లు ఆనందంతో మెరిసిపోవడం, ఇద్దరు స్వేచ్ఛగా ఎక్కడికో దూరంగా వెళ్లి ఉంటారు. వస్తారులే'' అంది రమ.

''ఏం! మనం అలా వెళ్లలేదనా నీ బాధ! తెలియందే ఎందుకు అలా మాట్లాడతావు రమా!''

రాత్రి పదిగంటల వేళ దారి వెతుక్కుంటూ ఎలాగో చేరారు రఘు సరసలు. దారి పొడగునా ఒక్క మాట మాట్లాడలేదు సరస.

*   ***   *

తెల్లవారగానే అందరూ వ్యానుఎక్కి ఊళ్లోకి వచ్చేశారు. మరునాడు క్లాసులో ఎప్పుడూకనబడే కళ్లు రఘూకి కనబడలేదు. ఎప్పుడూ తీక్షణంగా చూసే కళ్లు వాలిపోయి ఉన్నాయి. దీనికంతటికీ కారణం తనేనేమో అని వాపోయాడు. పరీక్షలు అయినవి. మళ్లా జీవితంలో రఘు సరసను కలవలేదు. ఆ కళ్లు కనబడలేదు. తనుమాత్రం ఆ సంఘటన మరచిపోలేకుండా ఉన్నాడు.

అంతే...

*   ***   *

అవేకళ్లు! అవే కళ్లు! ఎలా మరచిపోతాను. జీవితంలో మొదటి మధురస్మృతులు ఎలా ఎలా మరచిపోతాను. అని మనసులో అనుకుంటూ రైల్లో కిటికీలోంచి చూస్తూ....

రాఘవరావుకి ఆమెతో మళ్లీ మాట్లాడనిపించలేదు. రాత్రి భోజనాలు చేసి పడుకున్నారు. నిద్రలో మునిగారు.

ఉదయం అయ్యేసరికి రైలు ఢిల్లీ మహానగరం చేరడం. అందరూ ఎవరు హడావుడిలో వాళ్లు రైలుదిగడం జరిగింది.

రాఘవరావు మాత్రం సమయం చూసి

''సరసా! సరసా! బాగున్నావా? ఎన్ని సంవత్సరాల తరువాత మనం కలుసుకున్నాం''

''నేను సరసా! రఘూని! రఘూని మరచిపోవు కదూ!'' అని వీడిపోయాడు.

రఘు—రాఘవరావు భార్యతో వడివడిగా నడచి ఆ జనంలో కలిసిపోయారు.

సరస..సరోజిని ఆశ్చర్యంతో అలా నిలబడిపోయింది

జీవితమే అంత. అనుభవాలు, పరిసరాలు కాలగర్భంలో కలిసిపోతాయి! ●

**'శవ నటన'**

''నేను చచ్చిపోయినట్టు నటించిన సీను చూసి థియేటర్‌లో ప్రేక్షకులంతా నిజంగా ఏడ్చేశారట'' చెప్పింది కొత్తనటి కోమలి. 'చాల్లేవమ్మా... నిజంగా నువ్వు చావనందుకే ఏడ్చుంటారు'' కొట్టిపారేశాడు నిర్మాత.

—భమిడిపాటి ఎస్వీరావ్(చందానగర్)

